

ముగిసిన పీజీ సెట్

ఎచ్చెర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు, దాని అనుబంధ కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ పీజీ సెట్-2025 పరీక్షలు బుధవారం ముగిశాయి. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) కేంద్రంగా ఈ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో జరిగాయి. ఆఖరి రోజు బుధవారం నిర్వహించిన పరీక్షలకు మూడు షిఫ్ట్‌ల్లో కలిపి 596 మందికి 519 మంది హాజరయ్యారు. మూడు రోజులకు సంబంధించి మొత్తం 1,284 మందికి గాను 1,126 మంది హాజరయ్యారు.



ప్రగతి పరుగులు


అద్దంలా శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు

- రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైనవన్నీ పునరుద్ధరణ
- పోర్టుకు అనుసంధానంగా ఎయిర్‌పోర్టు
- 'ఆమదాలవలస-శ్రీకాకుళం' రోడ్డుకు మోక్షం
- గ్రామాల్లో తారు, సీసీ రోడ్లు
- ఐదు ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు
- పింఛన్ల పెంపు.. దివ్యాంగులకు జీవితంపై పెరిగిన భరోసా
- ఇదీ కూటమి ప్రభుత్వ ప్రత్యేకత

శ్రీకాకుళం, జూన్ 11(ఆంధ్రజ్యోతి):

శ్రీకాకుళం... పేదరికానికి చిరునామాగా... వలసల జిల్లాగా ముద్రపడింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అత్యంత కీలకమైన ప్రభుత్వ పదవులను ఇక్కడి ఆ పార్టీ నాయకులకు కేటాయించారు. ఇందులో ఒకరు అసెంబ్లీ స్పీకర్, మరొకరు ఉప ముఖ్యమంత్రి, ఇంకొకరు పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి. ఆ తర్వాత రెవెన్యూ మంత్రిగా మరొకరు.. ఇలా కీలకమైన పదవులు జిల్లాకు వరించాయి. వీరితో శ్రీకాకుళం జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని జనం ఆశించారు. కానీ.. వారి ఆశలు అడియాశలయ్యాయి. కనీసం గ్రామానికి ఒక్క రోడ్డు.. పట్టణంలో ఓ కాలువను కూడా నిర్మించలేకపోయారు. ఐదేళ్ల కాలంలో రాజకీయ కక్షలు.. అక్రమ కేసులు.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తెచ్చుకున్న పథకాలను నిర్లక్ష్యం చేసి.. డబ్బులు పంచుతున్నామన్న ధ్యాస తప్ప మరొకటి లేకపోయింది. దీంతో 2024 ఎన్నికల్లో వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగానూ.. ఇటు జిల్లాలోనూ పక్కబోర్లా పడింది. కూటమి ప్రభుత్వం కొలువు తీరి నేటికి ఏడాది పూర్తవుతోంది. కూటమి ఖాతాలో శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు చేరడంతో.. అదేరీతిన అభివృద్ధి పరుగులెడుతోంది. గత ప్రభుత్వానికి భిన్నంగా ఏడాదిలో ఇటు సంక్షేమ.. అటు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. పేదలకు నేరుగా లబ్ధి కలిగిన కార్యక్రమాలు అధికంగా ఉన్నాయి. సంతృప్తి స్థాయి లెక్కలేదు. ముఖ్యంగా పట్టణాల్లో కేవలం రూ.5కే కడుపు నిండా భోజనం లభించేలా చేశారు. అంతటా రోడ్లు వేసి.. కోట్లాది రూపాయల ఖర్చుతో అభివృద్ధి కార్యక్రమాలను పరుగులెత్తిస్తున్నారు.

● అన్నా క్యాంటీన్‌లలో 5,09,189 మందికి మధ్యాహ్న భోజనం

వైసీపీ హయాంలో అన్నా క్యాంటీన్లను మూసివేశారు. మరలా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్రీకాకుళంలో రెండు, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస కాశీబుగ్గలో అన్నాక్యాంటీన్లను ఏర్పాటు చేశారు. రూ.15కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాలు అందిస్తున్నారు(పూటకు రూ.5). ఇప్పటివరకు అల్పాహారం చేసినవారి సంఖ్య 2,37,412 మంది. మధ్యాహ్నం భోజనం 5,09,189 మంది. రాత్రి భోజనం చేసిన వారి సంఖ్య 1,62,686 మంది. పేదలు, చిరుద్యోగులు.. అసంఘటిత కార్మికులకు ఎంతగానో అన్నాక్యాంటీన్లు ఉపయోగపడుతున్నాయి. పట్టణ ప్రజలకు.. పట్టణాల్లో వివిధ పనులకు వచ్చేవారికి ఎంతగానో ఇవి ఉపయోగపడుతున్నాయి. మండల కేంద్రాల్లో కూడా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

● ఎన్టీఆర్ భరోసా.. మెగా డీఎస్సీ... ఉచిత సిలిండర్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024 ఏప్రిల్ నుంచి సామాజిక భద్రతా పింఛన్లపై రూ. వెయ్యి

(మిగతా 5వ పేజీలో..)

తాగునీటి సమస్య పరిష్కారం..



నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.106 కోట్లు తీసుకువచ్చాం. ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.23 కోట్లు తీసుకువచ్చాం. అవసరమైన రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో మూడు వంతెనల కోసం శంకుస్థాపన చేశాం. త్వరలో అవి పూర్తి అవుతాయి. మూడు గ్రోయిన్లు నిర్మాణానికి సీఎం అనుమతి ఇచ్చారు. కూలిన బాహుదా వంతెనను పునరుద్ధరిస్తున్నాం. వంశధార నుంచి ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలకు సురక్షిత నీటిని తీసుకువస్తున్నాం. ఇచ్ఛాపురంలో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటుచేశాం.

-బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం



మెళియాపుట్టిలో ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన స్థలం

సంక్షేమం రెట్టింపు



ఏడాదికాలంలో సంక్షేమం రెట్టింపు చేశాం. ఈ నాలుగేళ్లలో మరిన్ని పథకాలు అమలు చేస్తాం. మూలపేట పోర్టు, హార్బర్, కార్గో ఎయిర్‌పోర్టు ఇవన్నీ పూర్తయితే శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మారిపోతాయి.

-కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి

ఏడాదిలో ఎంతో అభివృద్ధి..



ఏడాది కాలంలో మా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డును పూర్తి చేశాం. నియోజకవర్గమంతా సీసీ రోడ్లు వేశాం. ప్రతి వారం ప్రజాదర్బార్ నిర్వహించి నియోజకవర్గ ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర, కేంద్ర మంత్రి సహకారంతో కోట్లాది రూపాయలను నియోజకవర్గానికి తీసుకువచ్చాం.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

ఆఫ్‌షోర్‌ను పట్టాలెక్కిస్తున్నాం



ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కోసం ఏడాది కాలంలో రూ.120 కోట్లను ప్రభుత్వం నుంచి తీసుకువచ్చాం. అసంపూర్తిగా ఉండిపోయిన ఆర్వోబీలను కూడా పూర్తిచేస్తున్నాం. ఏకంగా రూ.518కోట్లు ఈ ఏడాది కాలంలో నియోజకవర్గంలో ప్రభుత్వం వెచ్చించింది. ఇదీ కూటమి ప్రభుత్వ గొప్పతనం.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

ఎత్తిపోతలను పునరుద్ధరించాం..



గత వైసీపీ ప్రభుత్వంలో నరసన్నపేట నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యంగా విడిచిపెట్టేశారు. వాటిని మేము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పునరుద్ధరించాం. రూ.100 కోట్లతో అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. అత్యంత అవసరమైన వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నాం.

-బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

కాలువలకు నిధులు తెచ్చాం



తోటపల్లి, నారాయణపురం, మడ్డువలస కాలువలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాలువల పనులకు నిధులను తీసుకువచ్చాం. ఎచ్చెర్లలో భూగర్భ జలాలు మెరుగుపరిచేందుకు రూ.500కోట్లతో మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వం ముందు ఉంచాం.

-నడుకుదిటి ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

రోడ్లు వేశాం ..



పాతపట్నం నియోజకవర్గానికే రూ.650 కోట్లు పైబడి నిధులు తీసుకువచ్చాం. వంశధార ఫేజ్-2కోసం రూ.182 కోట్లు కేటాయించాం. నియోజకవర్గానికి ఐటీఐ, పాలిటెక్నికల్ కళాశాల, ఇండస్ట్రియల్ పార్క్ వంటివి తీసుకువచ్చాను. ఏడాదిలో పంచాయతీ రాజ్, ఉపాధి హామీ నిధులతో కనెక్టివిటీ రోడ్లు వేశాం.

-మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

రోడ్లను పూర్తి చేయిస్తున్నాం..



నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయిస్తున్నాం. ముఖ్యమైన శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డును పూర్తిచేశాం. రాజకీయాలను పక్కనబెట్టి అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. ఆమదాలవలసలో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించి రూ.5కే ఆహారం అందిస్తున్నాం.

-కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు

- నేడు పంపిణీ చేయనున్న అధికారులు
- జిల్లాకు చేరిన 1,74,015 కిట్లు


నందిగాం: వాహనంలో తరలిస్తున్న విద్యామిత్ర కిట్లు

మెళియాపుట్టి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. స్కూళ్ల ప్రారంభరోజే ప్రతి విద్యార్థికి రూ.2,279 విలువైన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్‌ను ఉచితంగా అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరిట కిట్లు అందించేవారు. అయితే, విద్యా సంవత్సరం ప్రారంభమైన కొన్ని నెలల వరకు కూడా విద్యార్థులకు పూర్తిస్థాయిలో కిట్లు అందేవి కావు. సగం సగం మాత్రమే పంపిణీ చేసేవారు. అవి కూడా నాసిరకంగా ఉండేవి. పైగా వైసీపీ రంగును పోలిన విధంగా ఉండేవి. కొందరు విద్యార్థులకు బూట్లు పెద్దవిగా, మరికొందరికి చిన్నవిగా ఉండేవి. యూనిఫారాల విషయంలో కూడా అదే పరిస్థితి. కొలతల ప్రకారం ఉండేవి కావు. దీంతో వాటిని ధరించేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. బ్యాగులు రెండు రోజులకే చిరిగిపోయేవి. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యా కిట్లు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రతి విద్యార్థికీ వాటిని అందించాలని ఆదేశాలు

(మిగతా 6వ పేజీలో)

బడికి వేళాయె!

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- సన్నబియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



రణస్థలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. 50 రోజుల వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయుల బదిలీలు, కొత్త పాఠశాలల ఏర్పాటు, సన్నాహాలు చేసింది. మరోవైపు విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ముందుగానే ప్రకటించింది. పాఠశాలల పనిదినాలు, సెలవులపై స్పష్టతనిచ్చింది. విద్యాసంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో కీలకమైన రెండు పథకాలకు శ్రీకారం చుట్టనుంది. మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ చేయనుంది. ఇప్పటికే వీటికి సంబంధించి సన్నాహాలు పూర్తిచేసింది. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1954, ప్రాథమికోన్నత పాఠశాలలు 268, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 416 ఉన్నాయి. మొత్తం 1,74,015 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్టు గణంకాలు చెబుతున్నాయి. వీరికి అవసరమైన 1,74,015 విద్యామిత్ర కిట్లు ఇప్పటికే పాఠశాలలకు చేరుకున్నాయి.

సన్నబియ్యంతో పౌష్టికాహారం

జిల్లాలో అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు 2,285 వరకూ ఉన్నాయి. సాంఘిక సంక్షేమ, బీసీ, ఇతర వసతిగృహాలు 281 వరకూ ఉన్నాయి. వీటన్నింటిలో గురువారం నుంచి సన్నబియ్యంతోనే భోజనాలు విద్యార్థులకు పెడతారు. ఇందుకు గాను నెలకు 620 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. గతంలో పౌరసరఫరాలశాఖ నుంచి డీలర్లకు.. అక్కడి నుంచి విద్యాసంస్థలకు అందించేవారు. అయితే పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. ఇక నుంచి నేరుగా గోదాముల నుంచి విద్యాసంస్థలకు తరలించాలని నిర్ణయించారు. 25 బస్తాల బియ్యాన్ని క్యూఆర్ కోడ్‌తో ఉన్న ట్యాగ్‌తో సరఫరా చేస్తారు. హెచ్‌ఎంలు స్కాన్ చేస్తే ఓటీపీ వస్తుంది. అప్పుడే ఈ బియ్యం విడుదలకు అనుమతిస్తుంది. దీంతో సన్నబియ్యం పక్కదారి పట్టే అవకాశమే ఉండదు.

ముందస్తు చర్యలు చేపట్టాం

ఈ ఏడాది విద్యాశాఖపరంగా ముందస్తు చర్యలు చేపట్టాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఇప్పటికే సన్నబియ్యం పంపిణీ చేశాం. ఫోర్టిఫైడ్ బియ్యం కావడంతో పురుగు పట్టేందుకు అవకాశం లేదు. హెచ్‌ఎంలు సైతం శ్రద్ధ వహించాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను సైతం విద్యార్థులకు విధిగా అందించాలి.

-తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

ఇంటి దొంగల పనే

- రెడ్డీస్ ల్యాబ్‌లో చోరీ కేసులో ఎనిమిది మంది అరెస్టు
- రూ.2 కోట్లు విలువైన డ్రగ్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రణస్థలం మండలం పైడిభీమవరం రెడ్డీస్ ల్యాబ్‌లో చోరీకి పాల్పడింది ఆ పరిశ్రమ ఉద్యోగులేనని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు 8మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2కోట్లు విలువైన సెమాగ్లూటైడ్ అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం విలేకరులకు వెల్లడించారు. రెడ్డీస్ ల్యాబ్‌లో సుమారు మూడు నెలల కిందట విలువైన డ్రగ్స్ మాయమైంది. దీనిపై పరిశ్రమ యాజమాన్యం జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారణకు ఒక స్పెషల్ టీంను ఎస్పీ నియమించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టగా ఎనిమిది మంది వ్యక్తులు ఈ దొంగతనంలో భాగస్వాములు అయినట్టు గుర్తించారు. వీరిలో నలుగురు అదే కంపెనీలో పనిచేస్తున్నట్టు గుర్తించారు. సీటీవో సిక్స్ ఎఫ్‌జీ వేర్‌హౌస్ వద్ద పని చేస్తున్న ఏ1-సురేష్, ఏ2-రాఘవేంద్ర, ఏ3అప్పలనాయుడు, ఏ4-కాంతారావు అనే నలుగురు ఉద్యోగులను అరెస్టు చేశారు. ముందుగా రాఘవేంద్రరావు 400గ్రాముల సెమాగ్లూటైడ్ అనే ప్రొడక్ట్‌ను దొంగతనం చేసి అప్పలనాయుడుకు ఇచ్చాడు. దాన్ని అప్పలనాయుడు సురేష్‌కు అందించి డిస్పోజ్ చేయాలని చెప్పాడు. సురేష్ విశాఖపట్నం జిల్లా దువ్వాడలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్‌లో పనిచేస్తున్న కాంతారావుకు ఆ డ్రగ్‌ను ఇచ్చాడు. కాంతారావు హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న తిరుపతి అనే వ్యక్తికి దాన్ని అందించి విక్రయించాలని చెప్పాడు. అయితే తిరుపతి ఆ ప్రొడక్ట్‌ను నిర్ణీత సమయంలో అమ్మకపోవడంతో, మరొక వ్యక్తి అయిన సురేష్‌రెడ్డికి ఇచ్చాడు. సురేష్‌రెడ్డి గతంలో అరవిందో కంపెనీలో పనిచేస్తున్న సమయంలో పెల్లాడియం అసిటేట్ అనే ప్రొడక్ట్ దొంగతనం కేసులో ముద్దాయిగా ఉన్నాడని ఎస్పీ తెలిపారు. అయితే సురేష్‌రెడ్డి కూడా ఆ ప్రొడక్ట్‌ను నిర్ణీత సమయంలో అమ్మకలేకపోయాడు. దీంతో బాలకృష్ణ, నవీన్‌కుమార్ అనే వ్యక్తులను హైదరాబాద్‌కు పంపించి ప్రొడక్ట్‌ను తీసుకొని రమ్మని తొలుత దొంగతనానికి పాల్పడిన పరిశ్రమ ఉద్యోగులు చెప్పారు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లిన బాలకృష్ణ, నవీన్‌కుమార్‌కు సురేష్‌రెడ్డి ఒరిజనల్ ప్రొడక్ట్‌కు బదులు డూప్లికేట్ ఇచ్చాడు. దీన్ని అమ్ముతుండగా నిందితులు పట్టుబడినట్లు

(మిగతా 6వ పేజీలో)


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నక్సలిజం అంతంపేరిట దేశంలో నరమేధం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పాతపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నక్సలిజం లేని దేశంగా చేస్తామంటూ ప్రధాని నరేంద్రమోదీ మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశంలో నరమేధం సృష్టిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పాతపట్నంలో సీపీఐ జిల్లా 25వ మహాసభలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సెంట్జైన్ స్కూల్ కూడలి నుంచి కోర్టు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడారు. 'అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలు. దీర్ఘకాలిక పోరాటాలతో సాధించుకున్న హక్కులను బీజేపీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేస్తుంది. సంస్కరణల పేరిట దేశ సంపదను కార్పోరేట్లకు కట్టబెడుతుంది. సైద్ధాంతిక విధానాలను మంటగొల్పుతుంది. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో కులమతాలు పేరిట ప్రజల మధ్య చిచ్చుపెడుతుంది. నక్సలిజం అణిచివేయడం పేరిట ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంది. ఎండీయూ ఆపరేటర్ల తొలగింపుతో రాష్ట్రంలో 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టులను పూర్తిచేయాలి.' అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, నాయకులు చాపర సుందర్ లాల్, అక్కినేని విమల, సనపల నర్సింహరావు, ఎస్.నారాయణస్వామి, లండ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఈనెలలోనే 'అన్నదాత సుఖీభవ'

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

6లో

రైతు సమస్యలను పరిష్కరించండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌తో భేటీ

6లో

అటు డీఎస్సీ.. ఇటు సంస్కరణలు

● విద్యాభివృద్ధి వైపు అడుగులు ● పాఠశాల, ఇంటర్ విద్య బలోపేతం
● జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం





నరసన్నపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో విద్యారంగంలో వివిధ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంతో పాటు ఇంటర్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు సీబీఎస్ఈ సిలబస్‌ను ఈ ఏడాది నుంచి అమలు చేస్తున్నారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు కూడా పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం శుచి.. రుచిగా ఉండే విధంగా మెనూను అమలు చేస్తోంది. ఇక నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మెగా డీఎస్సీతో ఉమ్మడి జిల్లాలో 543 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. వివిధ సంస్థల భాగస్వామ్యంతో విద్యార్థులు, యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

543 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులు దాదాపు ఏడేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశారు. ఈ తరుణంలో సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ మేరకు ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారు 28 వేలకు పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 543 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపాలిటీల్లో 458 పోస్టులు ఉన్నాయి. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 85 ఉపాధ్యాయపోస్టులు ఉన్నాయి. డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువు తున్న అభ్యర్థులలో నైపుణ్యాలను పెంపొందిం చేందుకు యువతకు శిక్షణ ఇస్తోంది. ఇందుకు గాను జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

ప్రాథమిక విద్య బలోపేతం..

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 117ను రద్దు చేసింది. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా మోడల్ ప్రైమరీ స్కూల్‌ను కొత్తగా తీసుకువచ్చింది. ఈ పాఠశాలల్లో 60 మంది కంటే ఎక్కువ మంది ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులు ఉంటే... ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడితో పాటు పీఎస్‌హెచ్‌ఎంను నియమించారు. ఏటా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు చట్టబద్ధత కల్పించింది. జిల్లాలోగల 2,638 ప్రభుత్వ పాఠశాలల్లో 1,71,535 మంది విద్యార్థులు చదువుతున్నారు.వీరికి మధ్యాహ్న భోజనం వండిపెట్టే నిర్వాహకులకు వంటలు రుచిగా, శుచిగా చేసేందుకు వేసవిలో శిక్షణ ఇచ్చింది.

ఇంటర్ విద్య ప్రక్షాళన..

జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపి.. సీట్లు సాధించాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ సిలబస్‌ను మార్పు చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ సౌజన్యంతో సిలబస్‌ను రూపొందించి సైన్స్ విద్యార్థులకు ఆరుపేపర్ల స్థానంలో ఐదింటిని తీసుకువచ్చారు. ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ లకు 85 మార్కులు థియరీ, 15 మార్కులకు ప్రాక్టికల్స్, గణితంలో గతంలో ఉండే ఎ, బి పేపర్లను కలిపి ఒకే పేపరుగా 100 మార్కులకు పరీక్ష నిర్వహించనున్నారు. ఆర్ట్స్, కామర్స్ విద్యార్థుల కోసం పోటీ పరీక్షలకు అనుగుణంగా సిలబస్‌ను సిద్ధం చేశారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో 20,678 మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.



పింఛన్‌తో ఆసరా దొరికింది..

కూలి పనులు కూడా చేసుకోలేని నాలాంటి వారికి ప్రభుత్వం అందిస్తున్న నాలుగు వేల రూపాయల పింఛన్‌తో ఎంతో ఆసరా లభించినట్లయింది. గతంలో ఇస్తున్న మొత్తానికి అదనంగా ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచడంతో ఎంతో మేలు జరుగుతోంది.

-కదంబాల సావిత్రి, సూదిపుట్టుగ, కంచిలి మండలం

ఎదురుచూపులే ఉండేవి..

మిల్లుకు ధాన్యం పంపిస్తే డబ్బులు ఎప్పుడు పడతాయో అని ఎదురు చూసేవాళ్లం. కూటమి ప్రభుత్వం ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా.. రైతుల ఖాతాలకు రోజుల్లోనే డబ్బులు జమ చేసింది. రైతులకు మేలు చేసేలా పని చేయడం బాగుంది.

-మహంతి, రైతు, ముండల, కంచిలి మండలం

నిరుద్యోగులకు ఊరట..



బీఈడీ, టీటీసీ పూర్తి చేసి... ఎటువంటి నోటిఫికేషన్లు లేక నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతో ఊరట లభించింది. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి... నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించ డం ఎంతో ఆనందం కలిగిస్తోంది.

-బి.దుర్గా శ్రీను, తలతంపర, కంచిలి మండలం

చంద్రబాబునాయుడు దేవుడు



శ్రీకాకుళంలో గిల్ట్ నగలను విక్రయిస్తున్నాను. కృష్ణా జిల్లా పామర్రు మా సొంతూరు. నాకు అన్నక్యాంటీన్‌లో పూటకు ఐదు రూపాయలతో భోజనం దొరుకుతోంది. నేను అతిశయోక్తిగా చెప్పడం లేదు. మావంటి వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే దేవుడు. తాను ఎన్నటికీ మరచిపోలేను.

-పి.దుర్గారావు, పామర్రు, కృష్ణా జిల్లా

పిల్లల చదువుకు ఉపయోగం



ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా రూ. 15వేలు ఇస్తామని సీఎం ప్రకటించారు. పిల్లల చదువుకు డబ్బులు ఉపయోగపడతాయి. గతంలో అప్పులు పాలయ్యేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదన్న ధైర్యం ఏర్పడింది.

-సవర గౌరమ్మ, నేలబొంతు, మెళియాపుట్టి మండలం

ధాన్యం డబ్బులు వెంటనే జమ



రైతులు ధాన్యం విక్రయించినందుకు 24 గంటల వ్యవధిలోనే డబ్బులు ప్రభుత్వం నుంచి జమ అవుతున్నాయి. ఇది రైతులకు ఆనందం. గతంలో ఆరు నెలల వరకు డబ్బుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది.

-తవుడు, రైతు, పట్టుపురం, మెళియాపుట్టి మండలం

బతుకుపై భరోసా పెరిగింది



ముసలోళ్లం అని చిన్న చూపు.. కుటుంబం నుంచి నిరాదరణ అవన్నీ పింఛను పెంపు వల్ల దూరమయ్యాయి. పైగా బతుకుపైనా భరోసా.నమ్మకం కలిగింది. పండుటాకులమైన మాకు ఆర్థికభరోసా కల్పించి సొంతంగా జీవించగలమనే ధైర్యం ఇచ్చింది ప్రభుత్వం.

-పడాల జగ్గమ్మ, నరహరిపురం, టెక్కలి మండలం

ఇంటికే పింఛన్ ఇస్తున్నారు



సచివాలయ సిబ్బంది ఇంటికి తెచ్చి పింఛను అందజేస్తున్నారు. ఏవిధమైన రాద్ధాంతం లేదు. మందుల కోసం నెలవారీ ఎవరిపైనా ఆధార పడకుండా పింఛను డబ్బులు రూ. నాలుగు వేలు ఉపయోగపడుతున్నాయి. ఎవరి మీద ఆధారపడడం లేదు.

-దక్కత సుందరమ్మ, గొల్లవీధి, ఇచ్ఛాపురం

సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం: కూన

ఆమదాలవలస, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తనపై ఉంచి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నానని, భవిష్యత్తులో కూడా ప్రజల సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి సమస్య పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు.రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకోవడంతో నియోజ కవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆయన టెలీకాన్ఫ రెన్స్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏడాదిలో నియోజకవర్గంలోని పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాలతో పాటు మునిసిపాలిటీ పరిధిలో సుమారు రూ.336 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు.

14 నుంచి ఆర్టీసీ బస్సు పాసుల జారీ

అరసవల్లి, జూన్11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం లో ఆర్టీసీరాయితీ బస్సు పాసులను ఈనెల 14 నుంచి జారీ చేయనున్నట్లు జిల్లా ప్రజా రవాణాఅధికారి ఎ.విజయకుమార్ తెలిపారు.పాత వెబ్‌సైట్‌ను నవీకరిస్తుండడంతో గురు,శుక్రవా రాల్లో వెబ్‌సైట్ పనిచేయదని పేర్కొన్నారు. 14 నుంచి యథావిధిగా పాసుల జారీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. విద్యార్థి స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు నకలు ప్రతిని ఆన్‌లైన్‌లో ఏపీఎస్ ఆర్టీసీ పీఏఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

డీఎస్సీకి 190 మంది హాజరు

ఎచ్చెర్ల,జూన్ 11(ఆంధ్రజ్యోతి):పాధ్యాయ పోస్టుల నియామకానికి నిర్వహిస్తు న్న మెగా డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇం జనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన డీఎస్సీకి ఉదయం షిఫ్ట్‌లో 75కు63 మంది, మధ్యా హ్నం షిఫ్ట్‌లో 131కు 127 మంది హాజరయ్యారు.రెండు షిఫ్ట్‌ల్లో కలిపి మొత్తం 206కు 190 మంది హాజరుకాగా, 16 మంది గైర్హాజరయ్యారు

కిక్కిరిసిన రోడ్లు.. కిటకిటలాడిన కాంప్లెక్స్

● భోజనాలకు తరలివచ్చిన బంధువులు
● పాత శ్రీకాకుళంలో ముగిసిన సిరిమానోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్/అరసవల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):పాత శ్రీకాకుళంలో బుధవారం సిరిమానోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా జడ్పీ కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం దాటిన తర్వాత కొత్తపేట, కునుకుపేట వరకు ప్రతి ఇంటి వద్ద టెంట్లు వేసి, ఇళ్లను పువ్వులతో అందంగా అలంకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులను భోజనాలకు ఆహ్వానిం చారు. దీంతో పెద్దఎత్తున బంధువులు, వివిధ ప్రాంతాల్లో ఉపాధికోసం వెళ్లిన కుటుంబసభ్యులు తరలిరావడంతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్ కూడా కిటకిటాడింది. దీంతో పోలీసు యంత్రాంగం బందోబస్తు పకడ్బందీగా నిర్వహించింది. పొట్టి శ్రీరాములు మార్కెట్ జంక్షన్ నుంచి జడ్పీ, సంతోషి మాత ఆలయం, 80 అడుగుల రోడ్డు, కలెక్టరేట్ బంగ్లా మీదుగా కునుకుపేట వెళ్లడానికి వాహనాలు అనుమతించలేదు.ఒక దశలో ద్విచక్ర వాహనచోదకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జడ్పీ కార్యాలయం నుంచి సంతోషి మాత ఆలయంవరకు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా ప్రతిఇంటా వివిధరకాల వంటలతో భోజనాలు ఏర్పాటుచేశారు. బంధువులను ఇళ్లల్లో గులాబీ పువ్వులు ఇచ్చి గంధం చల్లి ఆహ్వానించారు. నిర్వాహకులు డ్యాన్స్‌బేబీడాన్స్, పాటల పోటీలతో పాటు పలు వినోద కార్యక్రమాలు ఏర్పా టుచేశారు.ఒక్కో ఇంటి నుంచి 500 వందల మంది బంధువులు, మిత్రులను ఆహ్వానించినట్లు పలువురు చెబుతున్నారు. బంధువులు వివిధప్రాంతాల నుంచి తరలిరావడంతో కాంప్లెక్స్‌లో రద్దీ నెలకొంది.



ఓ ఇంటి వద్ద గులాబీ పువ్వు ఇచ్చి ఆహ్వానిస్తున్న నిర్వాహకులు



వాహనచోదకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న దృశ్యం

సిక్కోలులో ప్రగతి పరుగులు

(మూడో పేజీ తరువాయి)

చొప్పున పెంచి అందజేసింది. దివ్యాంగులకు పింఛను రెట్టింపు చేసి వారి జీవితాల్లో మరింత వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఆపై ఉచిత గ్యాస్ సిలిండర్లతో మొదటి విడత వేలాది మందికి లబ్ధి చేకూరింది. త్వరలో అర్హత ఉన్న కుటుంబాలకు తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి అమలు కానున్నాయి. మెగా డీఎస్సీతో శ్రీకాకుళం జిల్లాలో సమారు 600 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. పూర్తి సామర్థ్యంతో ప్రభుత్వ బడులు త్వరలో తెరుచుకోనున్నాయి. పేదలకు నాణ్యమైన పుస్తకాలు, సామగ్రిని ప్రభుత్వం అందజేయనుంది.

● **పథకాలన్నీ పునరుద్ధరణ**

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును ఐదేళ్లలో అటు స్పీకర్.. ఇటు రెవెన్యూ మంత్రి పూర్తి చేయలేకపోయారు. కానీ ఈ ఏడాది కాలంలో దాదాపు 90 శాతం రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఇదే రోడ్డులో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. వైసీపీ హయాంలో వంశధార ప్రాజెక్టు పనులను అటకెక్కించేసింది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ను పట్టించుకోలేదు. భావనపాడు పోర్టును పేరు మార్చేసి పట్టాలెక్కించారు. ఇప్పుడు వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులను ప్రాధాన్య జాబితాలో ప్రభుత్వం చేర్చింది. గొట్టా బ్యారేజీకి సైతం ప్రభుత్వం నిధులు ఇచ్చింది.

● **పాతపట్నానికి రూ.650 కోట్లు..**

పాతపట్నం నియోజకవర్గానికి ఏడాది కాలంలో ప్రభుత్వం నుంచి ఏకంగా రూ.650 కోట్లు మంజూరయ్యాయి. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకుగాను (వంశధార నుంచి) రూ.265 కోట్లు విడుదలయ్యాయి. ఐటీడీఏ పరిధిలో ఉన్న మండలాల్లో ఎల్.ఎన్.పేట మినహా అన్ని మండలాల్లో రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిధులు తెప్పించారు. పంచాయతీరాజ్ నుంచి గ్రామీణ ప్రాంతాల రోడ్లకు రూ.60 కోట్లు, రూ.210 కోట్లతో ఎనభై రోడ్లు, మెళియాపుట్టిలో ఇండస్ట్రియల్ పార్కు, నియోజకవర్గంలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల, వంశధార ఫేజ్-2 పనుల కోసం రూ.182 కోట్లు, అన్న క్యాంటీన్ల కు భవనాన్ని మంజూరు చేయించుకున్నారు.

● **పలాసలో రూ. 518 కోట్లు..**

పలాస నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో మంత్రి ప్రాతినిధ్యం వహించినా అభివృద్ధి సున్నా. గత ప్రభుత్వం తెచ్చిన పోర్టుకు పేరు మార్చేశారు. ఈ ఏడాదిలో అక్కడ అభివృద్ధి పనులకు రూ.518 కోట్లు వెచ్చించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించింది. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సీసీరోడ్లు, తారు రోడ్లకు ఉపాధి నిధుల నుంచి దాదాపు రూ. 100 కోట్లు ఖర్చు చేశారు. ప్రధానమంత్రి జన్‌మన్ స్కీమ్ ద్వారా కొంకడాపుట్టి వద్ద రెసిడెన్షియల్ స్కూల్ రూ.2.3 కోట్లతో నిర్మాణంలో ఉంది. జల్‌జీవన్ మిషన్ ద్వారా మూడు మండలాల్లో ఇంటింటికీ నీరు అందించేందుకుగాను రూ.110 కోట్లు, కాశీబుగ్గ రైల్వేగేటు ఆర్వోబీ నిర్మాణానికి రూ.43 కోట్లు, తాళభద్ర రైల్వేగేటు ఆర్వోబీకి రూ.50 కోట్లు, ఇరిగేషన్ కాలువలు, నగర వనాలు.. పంచాయతీల పరిధిలో రోడ్లు, వంతెనలకు కలిపి మొత్తం రూ.518 కోట్లు వెచ్చించారు.

నరసన్నపేట నియోజకవర్గానికి గతంలో ఉప ముఖ్యమంత్రి (వైసీపీ హయాంలో) ప్రాతినిధ్యం వహించారు. కానీ అభివృద్ధి లేదు. ఇప్పుడు ఏడాది కాలంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ముందుగా గ్రామీణ ప్రాంతాలకు.. అలాగే హైవేకు కనెక్టెడ్ రోడ్లను తీసుకువచ్చారు. బొంతు ఎత్తిపోతల పథకాన్ని రూ.180 కోట్లతో.. గార-వనిత మండలం వంతెన నిర్మాణాన్ని, అసంపూర్తిగా నిలిచిపోయిన వంద పడకల ఆసుపత్రిని పునరుద్ధరించారు. రూ. 100 కోట్లతో నియోజకవర్గంలో 149 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దాదాపు 85 శాతం రోడ్లు పూర్తయ్యాయి.

జిల్లాలో అత్యధిక పరిశ్రమలు ఎచ్చెర్ల నియోజకవర్గంలోనే ఉన్నాయి. కానీ స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదు. ఏడాది కాలంలో స్థానిక పరిశ్రమల్లో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. రూ.80 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం జరుగుతోంది. కొత్తపేట, ముద్దాడ, అదపాక, కొయ్యాం, కొచ్చెర్లకు రూ.కోట్లు వెచ్చించి తారు రోడ్లు నిర్మిస్తున్నారు. రూ. 250 కోట్లతో జలజీవన్ మిషన్ పనులకు అనుమతి మంజూరయ్యింది. వంశధార నుంచి సురక్షిత నీటిని అందించేందుకుగాను రూ.500 కోట్లు అవసరమని ప్రభుత్వానికి డీపీఆర్ పంపించారు. నారాయణపురం కాలువ, మడ్డువలస, తోటపల్లి కాలువల్లో పూడికతీతతో పాటు పెండింగ్ పనులు జరుగుతున్నాయి.

టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పెండింగ్ పనులను పూర్తి చేయిస్తున్నారు. పలాసలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతో శ్రీకారం చుట్టారు. అటు మూలపేట పోర్టు, ఇటు ఎయిర్ పోర్టు పూర్తయితే జిల్లా రూపురేఖలు మారనున్నాయి. భావనపాడు ఫిషింగ్ హార్బర్ పట్టాలెక్కింది. ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల, పలాస నియోజకవర్గాల్లో మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ఏకంగా రూ. 20వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఇచ్ఛాపురంలో తరచూ శంకుస్థాపనలతో కొత్త కార్యక్రమాలకు నాంది పలుకుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో తారు రోడ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. సామాన్యులకు గతంలో ఇబ్బందికరంగా ఉండే ఇసుక చౌకగా లభ్యమవుతోంది. ఇక మద్యం విషయానికొస్తే.. అప్పుడు 'జె' బ్రాం డ్లు మాత్రమే ఉండేవి. ఇప్పుడు టాప్ బ్రాండ్ల మద్యం లభ్యమవుతోంది. మద్యం విక్రయాల్లో పారదర్శకత ఏర్పడింది. గందరగోళంగా ఉండే జగనన్న ఇళ్ల కాలనీలను పక్కనబెట్టి.. ముందుగా సొంత ఇళ్లను నిర్మించుకునే వారికి ప్రభుత్వ సాయం రెట్టింపు చేసింది. ఇలా ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చెప్పుకోదగిన అభివృద్ధినే చేసింది.

తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతర వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు (ఐదెకరాల్లోపు) పండ్ల తోటల పథకం కోసం ఉపాధి హామీ పథ కం ద్వారా 2025-26 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని కలె క్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో కోరారు. వర్షాధారిత పండ్లతోటల పెంపకం కింద జిల్లాలో 22రకాల మొక్కలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.జాబ్‌కార్డు గల రైతులు ఎంపీడీవో, ఏపీవోను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం: జేసీ

పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్య మైన ఆహారం అందించడమే ధ్యేయమని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌పేర్కొన్నారు.ప్రస్తుతం సరఫరా అవుతున్న సాధారణ బియ్యం స్థానంలో త్వరగా ఉడికే, నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేస్తా మని తెలిపారు.గురువారం నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభ మవుతుందని పేర్కొన్నారు. 2599 పాఠశాలలు, 153 హాస్టళ్లకు కలిపి 655 టన్నుల సన్నబియ్యం సరఫరా పూర్తయిందని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. నాన్ టీఎస్‌పీ పరిధిలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 75 పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఈ మేరకు 21 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 సహాయకులు, ఒక మినీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రైతుల సంక్షేమమే లక్ష్యం: ఎన్ఈఆర్

రణస్థలం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు.బుధవారం కొండములగాంలో నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమం నిర్వహించారు.తొలుత రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కొండములగాం పంచాయతీలో రూ.28 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త దన్నాన సురేష్‌ను పరామర్శించారు.

ఎక్సైజ్ సీఐగా జీవీ రమణ

సోంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సోంపేట సర్కిల్ ఎక్సైజ్ సీఐగా జీవీరమణ బుధవారం విధుల్లోచేరారు. మొబైల్ పార్టీలో పనిచేసిన రమణ తాజాగా సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా జగన్నాథునికి దేవస్నానం

జిల్లాలో పలు ప్రాంతాల్లోని జగన్నాథ స్వామి ఆలయాల్లో బుధవారం స్వామికి దేవస్నానం, చందనోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 27 నుంచి రథయాత్ర ప్రారంభం కానుండడంతో ముందుగా స్వామికి దేవస్నానం చేయించారు. స్వామి అస్వస్థతకు గురై ప్రత్యేక గదిలో విశ్రాంతి తీసుకుని తిరిగి 27వ తేదీన భక్తులకు దర్శనం ఇస్తారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: జగన్నాథుని చందనంతో అలంకరించిన దృశ్యం


పలాస: జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


హరిపురం/మందస: సాబకోటలో జగన్నాథస్వామికి అభిషేకం


టెక్కలి: పెద్ద బ్రాహ్మణవీధిలో..


పలాస రూరల్: తర్లాకోటలో


ఎల్ఎన్‌పేటలో..


జలుమూరు: నారికేళ అభిషేకం


కవిటిలో..


శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేట ఆలయంలో..


కంచిలి: మఠంకంచిలి జగన్నాథాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

న్యాయం కోసం భర్త ఇంటి ముందు నిరసన

శ్రీకాకుళం క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం బలగ మెట్టు వద్ద ఉన్న ఓ ఇంటి వద్ద మహిళ కుమారుడితో తనకు న్యాయం చేయాలని నిరసనకు దిగింది. కాకినాడ వాకలపూడి శ్రీనివాసనగర్‌కు చెందిన బాధిత మహిళ దొండపాటి మంజుశ్రీ కథనం మేరకు.. శ్రీకాకుళంలోని బలగమెట్టుకి చెందిన వ్యక్తితో 2012లో మంజుశ్రీకి వివాహం జరిగింది. కాపురం కొన్నేళ్లు సాఫీగా సాగింది. ఇంతలో అదనపు కట్నం కోసం రోజూ భర్త వేధిస్తూ మానసికంగా హింసించేవాడు. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే భర్త కోర్టులో విడాకులు తీసుకోకుండా గత ఏడాది మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై మంజుశ్రీ శ్రీకాకుళం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు బాధితురాలు బలగ మెట్టులోని భర్త ఇంటి వద్ద న్యాయం కోసం పోరాటం చేసింది. విషయం తెలుసుకుని శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు ఆమెను బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. ఆమె భర్త ఇంటి వద్దకు వెళ్లకూడదని, కోర్టులో వ్యవహారం తేల్చుకోవాలని పోలీసులు పేర్కొనడం అన్యాయమని మంజుశ్రీ ఆవేదన వ్యక్తం చేసింది.


భర్త ఇంటి ముందు కుమారుడితో మంజుశ్రీ

చికిత్స పొందుతూ మహిళ మృతి

టెక్కలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి మెట్టవీధికి చెందిన గౌడు గీత(34) అనే వివాహిత బుధవారం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈనెల 9న కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబసభ్యులు ఆమెను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త సోమేష్ ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగువాడకు చెందిన వ్యక్తి..

పాతపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కాగువాడ గ్రామానికి చెందిన అగూరి కేశవరావు (41) రోడ్డు ప్రమాదంలో గాయపడి రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 9న రాత్రి 9.30 గంటలకు గ్రామంలో నడుస్తుండగా గంగుపేట నుంచి బూరగాం వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఉషాకుమారి ఫిర్యాదు మేరకు పాతపట్నం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లు పట్టివేత


అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

జలుమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి) వంశధార నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి కొమనాపల్లి వద్ద మాటు వేసి ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

బ్యాగ్, నగదు, బంగారం అప్పగింత

పాతపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సింగుపురం గ్రామానికి చెందిన మువ్వల లక్ష్మీనారాయణ కుటుంబంతో బుధవారం పాతపట్నం ఆల్ ఆంధ్రా కూడలి నుంచి సింగుపురానికి ఆటోలో ప్రయాణించి బ్యాగ్‌ను మరిచిపోయి దిగిపోయారు. బ్యాగులో రూ.20 వేలు నగదు, బంగారు చెవి దుద్దులు ఉన్నాయి. బ్యాగ్ మరిచిపోయిన విషయం గుర్తించి పాతపట్నం పోలీస్ స్టేషన్‌కు రాగా, కానిస్టేబుల్ రామకృష్ణ సీసీ ఫుటేజీలను పరిశీలించి ఆటో పర్లాకిమిడికి చెందిన నాగులపు సింహాద్రిదిగా గుర్తించి అతడిని పిలిచారు. అతను బ్యాగును, నగదు, బంగారాన్ని స్టేషన్ రైటర్ శంకర్ ద్వారా బాధితునికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కానిస్టేబుల్ జి.రామకృష్ణను సీఐ రామారావు అభినందించారు.


లక్ష్మీనారాయణకు నగదు, బంగారు వస్తువులను అందజేస్తున్న ఆటో డ్రైవర్

వైభవంగా ముఖలింగేశ్వరుని మంగళ స్నానం

జలుమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వరస్వామి మంగళ స్నానాలు బుధవారం వంశధార నదిలో వైభవంగా నిర్వహించారు. పాంచరాత్ర కల్యాణోత్సవాల చివరి రోజున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి నదికి తీసుకువెళ్లి పవిత్ర స్నానాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం


చిన్నారి తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

టెక్కలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండ్రవీధిలో నివాసముంటున్న నెల్లూరు శ్రీకాంత్, శృతి దంపతుల ఆరు నెలల కుమార్తె లవిత్రశ్రీ కాలేయ వ్యాధితో బాధపడుతుండడంతో ఆదుకునేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. బాలిక చికిత్సకు రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు దాతలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అభయం యువజన సేవా సంఘం సేకరించిన రూ.60 వేలు, 1995లో టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.93,500 బుధవారం ఆ కుటుంబానికి అందించారు. బాలిక ప్రస్తుతం శ్రీకాకుళంలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కార్యక్రమంలో పితాపురం నర్సింహమూర్తి, యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ

శ్రీకాకుళం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయి రైతు సమస్యలపై చర్చించారు. 2014-19 మధ్యలో చేపట్టిన ఉపాధి పనులకు రాష్ట్రానికి చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఎడిబుల్ ఆయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు వల్ల రాష్ట్రంలో పామాయిల్ రైతులు నష్టపోతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జాతీయ వ్యవసాయ కార్పొరేషన్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా పప్పు దినుసులను సేకరించే గడువు పెంచాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.


కేంద్ర వ్యవసాయ మంత్రితో చర్చిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

గ్రామాభివృద్ధికి యువత ముందుకు రావాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పోలాకి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి యువత ముందుకు రావాలని, మంజూరు చేసిన పనులు పూర్తయిన వెంటనే అదనంగా నిధులు, మరలా పనులు మంజూరు చేయిస్తానని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. చింతువానిపేట బీటీ, కమ్మరిపేట సీసీ రహదారిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చింతువానిపేటలో స్థానిక యువత చందాలు వేసుకుని, భూములిచ్చి రోడ్డును నిర్మించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. చెల్లాయివలస, గొల్లలవలస గ్రామపెద్దలు, యువకులు మంజూరుచేసిన రోడ్డు పనులకు అడ్డులేకుండా సొంత భూములను ఇవ్వడం శ్రద్ధ వహించి పెట్టుబడి పట్టడం అభినందనీయమన్నారు. కలెక్టర్ తొలుత గొల్లలవలస, తోటాడ గ్రామాలకు నిర్మించిన బీటీ రహదారి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో వంశధార స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, నాయకులు ఎంవీ నాయుడు, బీబీ రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

గిరిజన రైతులకు విత్తనాలు అందించాలి

- టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు అందజేయాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆదేశించారు. బుధవారం మర్రిపాడు-సి రైతుసేవా కేంద్రం, సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువగా గిరిజన రైతులు రావడాన్ని గమనించారు. 90 శాతం సబ్సిడీ విత్తనాలు కొందరికి అందలేదని వారు ఆయన దృష్టికి తీసుకురాగా రెండు రోజుల్లో అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ అధికారులన ఆదేశించారు. సచివాలయ సిబ్బంది హాజరుపట్టికను, రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు

(3వ పేజీ తరువాయి)

జారీ చేసింది. ఈ మేరకు కిట్లు ఎంఆర్‌సీల నుంచి నుంచి పాఠశాలలకు తరలించారు. గురువారం అన్ని పాఠశాలల్లో కిట్లు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కిట్‌లో ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్, వర్క్ బుక్‌లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, మూడు జతల యూనిఫారం, బ్యాగ్, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్ట్ అందించనున్నారు. ఒకటో తరగతి విద్యార్థులకు పిక్టోరియర్ డిక్షనరీ ఇవ్వనున్నారు. ఎలాంటి రాజకీయ రంగులు, బొమ్మలు లేకుండా వీటిని పంపిణీ చేయనున్నారు. కిట్లను స్కూళ్లకు సకాలంలో సరఫరా చేసేందుకు రాష్ట్ర, జిల్లా, మండల, స్కూల్ స్థాయిలో కమిటీలను ఏర్పా టు చేశారు. కిట్‌లో ఉన్న వస్తువులను పర్య వేక్షించేందుకు ఒక్కో సీనియర్ అధికారిని నియమించారు.

నాణ్యతను పరిశీలించేందుకు క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాతో సర్వశిక్ష అభియాన్ ఒప్పందం చేసుకుంది. ప్రతి వస్తువును మూడంచెల్లో తనిఖీ చేసిన తరువాతే విద్యార్థులకు అందించనున్నారు. జిల్లాలో 1,74,015 విద్యామిత్రకిట్లు పంపిణీ చేయనున్నారు. కొత్తగా ప్రవేశాలు పొందిన వారికి తరువాత అందించనున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

పలాస, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్న వారికోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రామారావు తెలిపారు. బుధవారం కార్యాలయంలో సచివాలయ, మునిసిపల్ ఉద్యోగులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం పురుషోత్తపురం, చిన్నబడాం సచివాలయాల్లో, శుక్రవారం పురుషోత్తపురం-1, పెంటవీధి, 24న శ్రీనివాస నగర్, పద్మనాభపురం, 25న ఎస్సీ వీధి, పద్మనాభపురంకాలనీ, 26న న్యూ కాలనీ, బత్తులవీధి, 27న మొగిలిపాడు, తాళభద్ర సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు పనిచే స్తాయన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.

ఈనెలలోనే 'అన్నదాత సుఖీభవ'

- మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈనెలలోనే 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఏరువాకకు సన్నద్ధమవుతున్న రైతులు సాగు చేసిన పంట లాభదాయకంగా ఉండాలని ఆకాంక్షిం చారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని, అన్నదాతకు అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే వరుణుడు కరుణించి వర్షాలు కురుస్తు న్నాయని, ఇవి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపత్రాలు అందజేసి యాంత్రీకరణ సామగ్రి కూడా అందజేశామని, రైతులు ఆనందో త్సాహాలతో ఉండా లన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.15 కోట్లతో మండల అభివృద్ధి

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలో మండలంలో రూ.15 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ వాన గోపి, జడ్పీటీసీ మెండ విజయశాంతి, తహసీల్దార్ జన్ని రామారావు, ఎంపీడీవో కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని సమావేశాలెందుకు?

- ఎంపీపీతో సహా సభ్యుల వాకౌట్

సంతబొమ్మాళి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులకు గౌరవం లేనప్పుడు మండల సమావేశాలు నిర్వహించడం ఎందుకంటూ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే పలువురు సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీల్లో ఒక్క పని కూడా చేయ నివ్వకుండా ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో పనులు అడ్డుకోవాలని ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వచ్చాయా అంటూ ఎంపీడీవో జయంత్ ప్రసాద్‌ను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించడం లేదని, సభ్యులను గౌరవం ఇవ్వనప్పుడు సమావేశా లు నిర్వహించడం ఎందుకంటూ ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, జడ్పీటీసీ పాల వసంతరెడ్డితో సహా సభ్యులంతా సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు.

అధికారులెందుకు రావడం లేదు?

మందస, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల సమావేశానికి అధికారులు సక్రమంగా హాజరుకావడం లేదని, దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని వైస్ఎంపీపీ సీర ప్రసాదరావు ప్రశ్నించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. మదస-హరిపురం రోడ్డు గోతులమయమై అధ్వానంగా మారిందని, అయితే ఆర్అండ్‌బీ అధికారులు హాజరుకాకపోవడంతో ఎవరు సమాధానం చెబుతారన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఇంటి దొంగల పనే

(3వ పేజీ తరువాయి)

చెప్పారు. ఈ మేరకు ఏ5-తిరుపతి, ఏ6-సురేష్‌రెడ్డి, ఏ7-బాలకృష్ణ, ఏ8-నవీన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు గతంలో కూడా అదే కంపెనీలో పెల్లాడియం అసిటేట్ కెమికల్ ప్రొడక్ట్‌ను సుమారు 3.38 కేజీలను దొంగతనం చేశారు. దీని విలువ రూ.60 లక్షలు ఉంటుందని, దాన్ని కూడా త్వరలో రికవరీ చేస్తామని ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద, జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి, లక్ష్మణరావు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతాల్లో తోటల పెంపకం ఎంతో మేలు

నరసన్నపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో తోటల పెంపకం రైతులకు ఎంతో మేలు చేకూరు స్తుందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఉద్యాన శాస్త్రవేత్త వి.హరికుమార్ అన్నారు. కేవీకే వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మెట్ట పంటల ఆవశ్యకత, ఉప యోగాలను వివరించారు. భారతీయ పరిశోధ నా మండలి శాస్త్రవేత్త డాక్టర్ ఆనందిత పాల్ మాట్లాడుతూ.. సమతుల ఎరువుల వినియోగం, కలుపుతీత, పురుగు మందుల వాడకాన్ని వివరించారు. శాస్త్రవేత్త సంధ్యారాణి ఖరీఫ్‌లో వరిపంట సాగు యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపికను వివరించారు. సర్పంచ్ రవీందర్ రెడ్డి, షణ్ముఖరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త సంధ్యారాణి

న్యూస్ బాక్స్

నెలరోజులుగా నీటి సరఫరా లేదు

టెక్కలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తేలినీలాపురం పంచాయతీ శ్రీరంగం గ్రామంలో నెలరోజులుగా రక్షిత నీటి పథకం మొరాయించింది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

15న ఉచిత కంటివైద్య శిబిరం

టెక్కలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి పెద్ద మందిరంలో ఈనెల 15న జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి వ్యాధులు, శుక్లాలు గల వారికి ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు స్పౌజ్ పింఛన్ల పంపిణీ

నందిగాం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో స్పౌజ్ పింఛన్లను గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కుమార్ పట్నాయక్ తెలిపారు. మండలంలో 22 సచివాలయాల పరిధిలో భర్త చనిపోయిన భార్యలకు సుమారు 118 పింఛన్లు మంజూరవడంతో వీటిని నందిగాంలో పంపిణీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

పాడి రైతు అభివృద్ధే ధ్యేయం

జలుమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాడి రైతు అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక పశువుల ఆసుపత్రిలో రైతులకు రాయితీపై పశుదాణా బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీ మంద లోకనాథం, పశు వైద్యాధికారులు ముద్దాడ దీప్తి, కె.నారాయణమూర్తి, టీడీపీ నేతలు వెలమల రాజేంద్ర నాయుడు, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

పోలాకి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వనితమండలం వద్ద వంశధార నదిపై నిర్మిస్తున్న వంతెన పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోలాకిలో పంచాయతీరాజ్ ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్షించారు. గతంలో తాను మంజూరు చేయించిన పీఆర్, ఎన్ఆర్ఈజీఎస్‌లతో నిర్మించిన రహదారి పనులకు బిల్లు బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో పీఆర్ఈఈ, డీఈ రామారావు, రామినాయుడు, ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరుకున్న విద్యార్థి మిత్ర కిట్లు

నందిగాం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు పర్యవేక్షణలో బుధవారం పాఠశాలలకు తరలించారు. ఒకటి నుంచి పది తరగతులకు 4,002 మందికి సంబంధించి 99 పాఠశాలలకు ఈ కిట్లు చేరాయి. వీటిని పాఠశాలల ప్రారంభం రోజు నుంచే పంపిణీకి ఏర్పాట్లు చేశారు. కిట్‌లో షూ, సాక్సులు మినహా అన్ని రకాల వస్తువులు రావడంతో హెచ్‌ఎంలు నందిగాం ఉన్నత పాఠశాల పంపిణీ కేంద్రం నుంచి తరలించారు. అలాగే పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి సన్న బియ్యం డీలర్ల ద్వారా పంపిణీ చేశారు.